Andhra Prabha – Dt: 22/10/2017

# ఆరాంఘర్ నిర్మాణం అద్భుతం

## నిర్మాణ పనులను పరిశీలించి ముగ్ధుడైన మిలిటరీ చీఫ్





హైదరాబాద్, అక్టోబర్ 21 (కెఎన్ఎన్): హైదరాబాద్ నగరానికి మణిహారంగా నిలిచిన మెట్రో రైలు పలు మైలురాళ్ళను అధిగమిస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ వద్ద నిర్మించే ఇంటర్‌చేంజ్ స్టేషన్ నిర్మాణం కోసం రక్షణ శాఖ నుంచి 2.15 ఎకరాలను హైదరాబాద్ మెట్రో రైలు సేకరించింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా మెట్రోరైలు అధికారులు రక్షణ శాఖ సైనికుల కోసం నిర్మించే సైనిక్ ఆరాంఘర్ (విశ్రాంతి భవనం)ను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని పాత గాంధీ ఆసుపత్రి ప్రాంగణంలో 1.68 ఎకరాల్లో నాలుగు అంతస్థుల్లో అత్యాధునిక వసతులతో సుమారు 60,560 అడుగుల విస్తీర్ణంలో రూ.9.36 కోట్ల వ్యయంతో నిర్మిస్తుంది. ఈ నేపథ్యంలో సైనిక్ ఆరాంఘర్ నిర్మాణ పనులను మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి, రక్షణ శాఖ చీఫ్, తెలంగాణ-ఆంధ్ర సబ్‌ఏరియా చీఫ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస రావు సంయుక్తంగా పరిశీలించారు. సైనిక్ ఆరాంఘర్ నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయని, కాగా నిర్మాణపనులు నాణ్యతతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉన్నాయని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా సివిల్-రక్షణ శాఖ సహకారంతో ఎంతో ఉపయోగంగా ఉండే భవనాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. కాగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోనే సైనిక్ ఆరాంఘర్ ఉండటంతో స్టేషన్‌లో దిగిన సైనికులకు ఈ భవనం ఉపయుక్తంగా ఉంటుందని మేజర్ జనరల్ శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. కొద్ది నెలల్లో అందుబాటులోకి రానున్న సైనిక్ ఆరాంఘర్‌లో అన్ని పౌరశాఖల సమన్వయంతో దేశాన్ని రక్షించే మిలిటరీ అధికారులు అత్యున్నత సంతృప్తి వ్యక్తపరిచేలా వసతులు కల్పించాలని నిర్మాణ పనుల్లో ఉన్న ఇంజినీర్లకు సూచించడం గమనార్హం. సైనిక్ ఆరాంఘర్‌ను సందర్శించిన వారిలో క్వార్టర్ మాస్టర్ (హెడ్ క్వార్టర్స్) కల్నల్. అతుల్ రాజ్‌పుత్, ఎస్ఈ (హెచ్ఎంఆర్ఎల్) సీ.వినోద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (హెచ్ఎంఆర్ఎల్) శ్రీ లక్ష్మి, రక్షణశాఖ అధికారులు, మెట్రోరైలు అధికారులు పాల్గొన్నారు.

